క్లుప్తంగా

రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడిగా కళ్లం


కళ్ళం విజయభాస్కరరెడ్డిని సత్కరిస్తున్న జేసీ శ్యాంప్రసాద్, మురళి తదితరులు

సత్తెనపల్లి: కొమెరపూడి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు, ఉమ్మడి గుంటూరు జిల్లా రైతు సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడిగా నియమితులయ్యారు. మంగళవారం పల్నాడు జిల్లా నరసరావు పేటలో జరిగిన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో కళ్లం విజయ భాస్కర్ రెడ్డికి పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ , పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు సాయి మాల కొండా రెడ్డి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకొచ్చి రైతులకు మేలు జరిగేలా కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.

జగనన్న చిత్రపటానికి క్షీరాభిషేకం


జగనన్న చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

రాజుపాలెం: రాజుపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని జగనన్న చేదోడు లబ్ధిదారులు సర్పంచ్ పులిబండ్ల అశోక్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి సచివాలయం వద్ద మంగళవారం క్షీరాభిషేకం చేశారు. చేతివృత్తులు కలిగిన 15 మంది లబ్ధిదారులకు మూడో విడత జగనన్న చేదోడు అందడంతో హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బత్తుల సాంబశివరావు, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఎస్‌కే జానీ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతం కావాలి

- బీజేపీ జోనల్ ఇన్‌చార్జి సూర్యనారాయణ


అమరావతి: గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని భారతీయ జనతా పార్టీ జోనల్ ఇన్‌చార్జి సూర్యనారాయణరాజు చెప్పారు. మంగళవారం స్థానిక ఏవీఆర్ కల్యాణ మండపంలో బీజేపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకరబాబు అధ్యక్షతన నిర్వహించిన పార్టీ పల్నాడు జిల్లా కార్యవర్గ సమావేశంలో సూర్యనారాయణరాజు ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలు, నరేంద్రమోదీ సమర్థతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం విద్యా, వైద్యం, పలు సామాజిక అంశాలపై తీర్మానాలు చేసి అమోదించారు. తర్వాత పల్నాడు జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఉమామ హేశ్వరరావు, సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి పక్కాల సూరిబాబు ప్రసంగించారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీ, ఒకరి మృతి


సుబ్బయ్య మృతదేహం

అచ్చంపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మాదిపాడుకు సమీపంలో సోమవారం రాత్రి జరిగింది. చల్లగరిగ గ్రామానికి చెందిన దోగిపర్తి సుబ్బయ్య(62) రాత్రి 9.30 గంటల సమయంలో బైక్‌పై మాదిపాడు నుంచి స్వగ్రామమైన చల్లగరిగ వస్తుండగా అచ్చంపేట నుంచి మాదిపాడుకు వెళుతున్న మరో బైకు ఢీకొట్టింది. దోగిపర్తి సుబ్బయ్యకు తీవ్రగాయాలై అధిక రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్ర గాయాలు కావడంతో సత్తెనపల్లి వైద్యశాలకు తరలించారు.

విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పిడుగురాళ్ల: పట్టణంలోని పిల్లుట్ల రోడ్డులోని సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి మంగళవారం విశేష అలంకరణ నిర్వహించారు. స్వామికి ముందుగా పలు రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పలు రకాల పూలతో అలంకరించారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

జగనన్నతోనే సంక్షేమ విప్లవం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


క్రోసూరులో సంక్షేమ పథకాల లబ్ధిదారుకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరుశంకరరావు

క్రోసూరు: పేదల క్షేమం కోసం కష్టపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ విప్లవం సాధ్యమైందని పెదకూరపాడు శాసన సభ్యులు నంబూరు శంకరరావు చెప్పారు. క్రోసూరు సచివాలయం–2 పరిధిలో రెండో రోజు మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఈ మూడున్నరేళ్లలో ప్రతి కుటుంబం పొందిన లబ్ధి గురించి వివరించారు. పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను అందించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారమార్గం చూపారు. మరికొన్ని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడున్నరేళ్లలో అన్ని వర్గాలకు సంక్షేమం అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. తాము చేసిన దాంట్లో కనీసం పదిశాతమైనా గత టీడీపీ ప్రభుత్వ పాలనలో చేశారా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ పాలనలో అందిన సంక్షేమం, జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాలు పేదల జీవితాల్లో వెలుగులు విరబూస్తున్నాయన్నారు. క్రోసూరులోని సచివాలయం–2 పరిధిలో వివిధ పథకాల ద్వారా ప్రజలకు రూ.10.69 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లా చందమామ, ఎంపీపీ పి.కోటయ్య, జెడ్పీటీసీ షేక్ జమీలా, షేక్ గఫూర్,షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మస్తాన్, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుములకోటిరెడ్డి, జూనియర్ వెంకట్రావు, షేక్ ఖాదర్, పాశంశ్రీనివాసరెడ్డి, మాజీ యార్డు చైర్మన్ డాక్టర్ షరీఫ్, మాజీ యార్డు డైరెక్టర్ అంబటినారాయణ,దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి గార్లపాటి దాసు,కేశవరెడ్డి,మండల కన్వీనర్ వెలది అప్పారావు, మేదరరోశయ్య, షేక్ షుకుర్, ఇన్‌చార్జి ఎంపీడీవో పి.శివరామయ్య, పంచాయతీ కార్యదర్శి శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.24.79 కోట్లతో సత్తెనపల్లి మున్సిపల్ బడ్జెట్

- ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్
- అధికార, విపక్ష కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం
- 20 అంశాలకూ గ్రీన్‌సిగ్నల్



సమావేశంలో కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు ఇన్‌సెట్‌లో.. కౌన్సిల్‌ను పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసీ

సత్తెనపల్లి: పురపాలక సంఘ 2023–24 సంవత్సరం బడ్జెట్‌ను రూ. 24.79 కోట్లతో మంగళవారం ప్రవేశ పెట్టారు. దీనిని కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరిగిన మున్సిపల్ ప్రత్యేక, సాధారణ సమావేశంలో బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ ప్రకటించగా సభ్యులంతా హర్షం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సాధారణ సమావేశం లో అజెండాలోని 20 అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు.

- 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ వాటర్ ట్యాంకర్లు ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. దీనికి రెండు ఉన్నాయని కమిషనర్ షమ్మీ బదులిచ్చారు. అయితే బడ్జెట్‌లో ట్యాంకర్ల నిర్వహణకు రూ.8 లక్షలు ఖర్చవుతుందని చూపారని, అంతెందుకని సుమన్‌కుమార్ అనుమానం వ్యక్తం చేశారు. కమిషనర్ బదులిస్తూ.. అది అంచనా అని, ఇతర మున్సిపల్ వాహనాల నిర్వహణ ఖర్చులు ఉంటాయని, పాత వాహనాలు ఎక్కువగా మరమ్మతులకు వస్తుంటాయని వివరించారు.
- మళ్లీ కౌన్సిలర్ సుమన్ కుమార్ మాట్లాడుతూ వీధి దీపాల కరెంటు ఖర్చులు, లైటింగ్ నిర్వహణ ఖర్చు అంటూ రెండు రకాలుగా చూపారని చెప్పగా, ఎల్ఈడీ దీపాల నిర్వహణ, స్తంభాలు ఏర్పాటు , ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, కరెంటు చార్జీలు వేరుగా ఉంటాయని కమిషనర్ బదులిచ్చారు.
- డ్రెయినేజీ రిపేరు, కాల్వలో మురికి తీయుటకు అయ్యే ఖర్చు రివైజ్డ్ రూ.50 లక్షలు చూపారని కాలువలు మరమ్మతులు ఎక్కడైనా చేయాలని గుర్తించారా అని సుమన్‌కుమార్ ప్రశ్నిస్తూ.. పట్టణంలో పారిశుద్ధ్య పరిస్థితి గురించి ఫొటోలు ప్రదర్శిస్తూ విమర్శలు చేశారు. దీంతో 19వ వార్డు కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు జోక్యం చేసుకున్నారు. ఎక్కడైనా అపరిశుభ్రత ఉంటే అధికారులకు తెలియజేయాలని, ఇలా ఏకపక్షంగా మాట్లాడడం సరికాదని పేర్కొన్నారు. కమిషనర్ కొలిమి షమ్మి మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టామని, ఈ విషయంలో ఎలాంటి విమర్శలు, ఆరోపణలకు తావులేదని స్పష్టం చేశారు.

లేనివి మాట్లాడొద్దు

మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్ మీరాన్ మాట్లాడుతూ పేపర్లల్లో ఫొటోల కోసం లేనివి మాట్లాడొద్దని, పట్టణంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు లేకుండా అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. కేవలం రాద్ధాంతం చేసి పత్రికల్లో ఎక్కాలనుకోవడం సరికాదన్నారు. కౌన్సిలర్ సుమన్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు ప్రస్తావించినా పట్టించుకోనందుకు నిరసనగా సమావేశం నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి వెళ్ళిపోయారు.

- 31వ వార్డు కౌన్సిలర్ తురక మేరీగ్రేస్ మాట్లాడుతూ పుష్‌కాట్ల మరమ్మతుల్లో జాప్యం జరుగుతుందని వివరించారు. ట్రీగార్డ్స్‌కు బదులు వెదురు కర్రలు పెడుతున్నారని వెల్లడించారు. బడ్జెట్‌లో 40 శాతం మురికివాడలో ఖర్చు చేయాలన్న నిబంధన ఉందని, గత ఏడాది ఎంత వరకు చేశారో చెప్పాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు గతంలో తీర్మానించామని ఇంతవరకు ఏర్పాటు చేయలేదన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, డీఈ మధుసూధన్‌రావు, మేనేజర్ ఎస్. సాంబశివరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు తదితరులు పాల్గొన్నారు.

2023–24 బడ్జెట్ అంచనాలు ఇలా..	(రూపాయల్లో)
ప్రారంభ నిల్వ :	20,78,42,031
ఆదాయం :	33,84,07,824
వ్యయం :	18,13,05,000
ముగింపు నిల్వ :	24,79,65,831

అందరిలో సేవా దృక్పథం అవసరం

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


కుట్టు మిషన్ పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేదలకు సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మంగళవారం 8వ విడత కలాం చేయూత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వాలు ఎన్ని చేసినా స్వచ్ఛంద సంస్థలూ చేయూత అందించాలన్నారు. ఈ సందర్భంగా కీర్తిశేషులు వెలుగూరి వెంకటేశ్వర్లు ధర్మపత్ని అండాళ్ళు జ్ఞాపకార్థం వెలుగూరి శరత్ బాబు, వారి బంధుమిత్రుల సహకారంతో 12వ వార్డు కౌన్సిలర్ లోక కళ్యాణి ఆధ్వర్యంలో 12వ వార్డులోని పేద మహిళ సగలా రేణుకకు కుట్టు మిషన్‌ను మంత్రి బహూకరించారు. కలాం చేయూత నిర్వాహకుడు వెలుగూరి శరత్ బాబు మాట్లాడుతూ కలాం చేయూత కార్యక్రమాలకు సహకరిస్తున్న షేక్ జానీ అలియాస్ గుంటూరు జానీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లోక మాధవ, అచ్యుత శివప్రసాద్, కోడిరెక్క దేవదాస్, పెద్దింటి వెంకటేశ్వర్లు, వల్లెం నరసింహారావు, పెద్దింటి వెంకటేశ్వర్లు(చిట్టి), కొత్త రామకృష్ణ, శివపురం రామారావు, సహారా మౌలాలి, దేవరశెట్టి రవి, బచ్చు మనోహర్, బండి మల్లికార్జునరెడ్డి, మహమ్మద్ యూనస్, రేపూడి రవితేజ, గుజ్జర్లపూడి సతీష్, నారా యణ, మందడప శివసాయి, ఉల్లంఘులు ప్రసాద్, గుంటూరు ఆశీర్వాదం పాల్గొన్నారు.

నేత్రపర్వం.. లక్ష్మీనరసింహుని కల్యాణం


స్వామి కల్యాణ తంతును నిర్వహిస్తున్న పూజారులు

మాచవరం: మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీ నరసింహా స్వామి 67వ కల్యాణ మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కల్యాణ ఘట్టాన్ని కన్నులారా తిలకించారు. దంపతులు పీటలపై కూర్చొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు వేద మంత్రోచ్ఛరణలతో మంగళ సూత్రధారణ చేపట్టారు. ఆలయ పూజారులు స్వామి కల్యాణ విశిష్టతను తెలియజేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కిటకిట లాడింది. పరిసరాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు. తిరునాళ్ళకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు. కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు స్థానిక జెడ్పీ హైస్కూల్లో శ్రీలక్ష్మీనరసింహస్వామి రైతు సేవా సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 20 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి ఎడ్ల పందేలు

జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజముల బల ప్రదర్శన పోటీలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. జత పండ్ల విభాగంలో పోటీలు ఉంటాయని, గెలుపొందిన వారికి జతలకు నగదు బహుమతులు ఉంటాయని వివరించారు.

పొలంబడితో రైతులకు విజ్ఞానం


ప్రదర్శనను పరిశీలిస్తున్న పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళి, అధికారులు

నకరికల్లు : డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం రైతుల్లో విజ్ఞానాన్ని పెంచి తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు దోహదపడుతోందని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. మండలంలోని గుండ్లపల్లి, నర్సింగపాడు గ్రామాల్లో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. గ్రామసభలు, వరిలో వివిధ దశల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, మానవునిపై పురుగుమందుల ప్రభావం, విత్తనశుద్ధి, విత్తన మొలకశాతం, నీటినిలువ సామర్థ్యం, వేరుదారుల ప్రయోగం తదితర అంశాలపై ప్రదర్శనలు నిర్వహించి రైతులకు కళ్లకు కట్టినట్లు వివరించారు. డీడీఏ శివకుమారి, కమిషనర్ కార్యాలయం వ్యవసాయాధికారి ఉషారాణి, జిల్లా వ్యవసాయ కార్యాలయం వ్యవసాయాధికారి సుజాత, పల్నాడు జిల్లా పొలంబడి మానిటరింగ్ అధికారి వై.హనుమంతరావు, క్రోసూరు, పిడుగురాళ్ల ఏడీఏలు బి.శ్రీకృష్ణదేవరాయలు పొలంబడి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, రైతులు పాల్గొన్నారు.

పశు సంపద రక్షణకు చర్యలు


గోశాలలో పశు సంవర్ధక శాఖ అధికారులు

దుర్గి: పశు సంపద రక్షణకు ప్రభుత్వం కృషి చేస్తోందని పశు సంవర్ధక శాఖ ఏడీ బి. జగదీష్‌బాబు చెప్పారు. పశు సంవర్ధక శాఖ పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం శ్రీ నిదానంపాటి అమ్మవారి ఆలయంలోని శ్రీలక్ష్మీ గోకుల సదన్‌లో ఆవుల సంరక్షణపై ఆయన సూచనలు చేశారు. గోవులకు గొంతువాపు, గాలి కుంటూ వ్యాధులు ప్రబలకుండా వ్యాక్సిన్ ఇచ్చారు. స్థానిక ఆలయ అధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ నోరులేని జీవాలు పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మమ్ము శివరాం, దుర్గి పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.

గోళ్లపాడులో కంటి వెలుగు


గోళ్ళపాడులో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): గోళ్ళపాడు గ్రామంలో వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో కంటివైద్య నిపుణులు సీహెచ్ మధుబాబు పాల్గొని కంటి పరీక్షలు నిర్వహించారు. 60 ఏళ్లు పై బడిన వారికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించారు. కళ్లజోళ్లు కూడా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపుఅప్పమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్ కె.వి.నాగమల్లేశ్వరరావు, ఎమ్ఎల్‌హెచ్‌పీ బి.అంజలి, ఏఎన్ఎమ్ ఆదిలక్ష్మీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరునాళ్లలోపు పనులు పూర్తిచేయాలి


దేవరంపాడు దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర మంత్రి అంబటి

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మంగళవారం పరిశీలించారు. రెండు రోజుల క్రితం రూ.కోటితో నిర్మిస్తున్న కల్యాణ మండపానికి శ్లాబు వేశారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి మంత్రి అంబటి రాంబాబు సూచనలు, సలహాలు ఇచ్చారు. తిరునాళ్ల లోపు పనులు ముగించాలని ఆదేశించారు. ఆయన వెంట మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి చంద్రమౌళి, సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, ఈవో సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు పులిబండ్ల అశోక్, సానికమ్ము శ్రీనివాసరెడ్డి, గన్నుపల్లి బుల్లిబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ తోట మోహన్‌రావు, తోట లక్ష్మీనారాయణ, సత్తెనపల్లి ఏఎంసీ చైర్మన్ రాయపాటి పురుషోత్తం, విజయభాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు

అమరావతి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు చెప్పారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మేకల హనుమంతరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుతం మండల పరిషత్ ద్వారా రూ.2.01 కోట్లను ఎంపీటీసీ సభ్యులు సూచించిన అభివృద్ధి పనులకు కేటాయించినట్టు పేర్కొన్నారు. గ్రామాలలో సిమెంట్ రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు, గ్రావెల్ రోడ్లు, అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణంతోపాటుగా మునగోడు రైతుల చిరకాల కోరిక ఎద్దువాగుపై బ్రిడ్జి నిర్మాణం తదితర పనులను ఆమోదించినట్టు వెల్లడించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో మండల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ కో–ఆప్షన్ మెంబరు షేక్ హాష్మీ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు మంగిశెట్టి శ్రీనివాసరావు, అళ్ల శివలక్ష్మీకుమారి, ఎంపీడీఓ మాధురి, వైఎస్సార్ సీపీ నాయకుడు నంబూరు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల వెంబడి ఆక్రమణలు తొలగించండి

ఎంపీపీ మారూరి పద్మ

ముప్పాళ్ళ: రోడ్ల వెంబడి ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు తొలగించేలా చర్యలు చేపట్టాలని ఎంపీపీ మారూరిపద్మ ఆర్అండ్‌బీ ఏఈ సురేష్‌ను ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ రోడ్ల పక్కన వెలిసిన అక్రమ నిర్మాణాల్లో మత్తు పదార్థాలూ విక్రయిస్తున్నారని, దీని వల్ల మత్తుపదార్థాలకు బానిసై ఇటీవల ఒక విద్యార్థి కూడా మృతి చెందాడని గుర్తు చేశారు. అక్రమ నిర్మాణాలపై త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఆర్అండ్‌బీ ఏఈ వెల్లడించారు. ముప్పాళ్ళలోని రక్షిత మంచినీటి పథకం ఓవర్‌హెడ్ ట్యాంక్ నిరుపయోగంగా మారిందని, మరమ్మతులు చేపట్టి గ్రామస్తులకు తాగునీరు అందేలా చూడాలని కో ఆప్షన్ సభ్యుడు అజ్గర్‌ఆలీ అధికారుల దృష్టికి తెచ్చారు. కొంకావారిపాలెంలోనూ ఇదే పరిస్థితి ఉందని, వేసవి రానున్న దృష్ట్యా కుళాయిలు బిగించి తాగునీరు అందేలా చూడాలని వైస్ ఎంపీపీ రాయన్న అధికారుల దృష్టికి తెచ్చారు. ఎంఈఓ ఒంగోలు రాజు మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారులు ఐదోతేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

రాజుపాలెం: జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఈనెల 5వ తేదీ లోపు గ్రామ సచివాలయాలలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వారికి ఇళ్ల నిర్మాణాలు చేపడతామని హౌసింగ్ ఏఈ చింతపల్లి మురళిమనోహర్‌జోషి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న కాలనీలపై పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, సర్పంచ్‌లకు అవగాహన సమావేశం మంగళవారం నిర్వహించారు. హౌసింగ్ ఏఈ మాట్లాడుతూ ఈనెల 25 నుంచి మండలంలోని జగనన్న 16 లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. మండలంలో 850 మంది లబ్ధిదారులు ఉన్నారని, లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకునేందుకు గ్రామ సచివాలయాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని చెప్పారు. అలాగే సొంత స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే వారు గ్రామ సచివాలయాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వివరించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, ఎంపీడీవో టి.శ్రీనివాసరావు, సర్పంచ్ పులిబండ్ల అశోక్, ఏఈలు భవాని, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను వందశాతం నమోదు చేయాలి


మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు, ఎంఈవో శ్రీనివాసరావు, తదితరులు

సత్తెనపల్లి: బడి బయట పిల్లల్ని 100 శాతం నమోదు చేయడం సీఆర్‌పీల ప్రధాన బాధ్యత అని సత్తెనపల్లి ఉప విద్యాశాఖ అధికారి వి.వెంకటేశ్వరరావు చెప్పారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం డివిజన్ స్థాయి సీర్పీల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు మాట్లాడుతూ బడి బయట పిల్లల్ని బడిలో చేర్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని కోరారు. ఏఎల్ఎస్‌సీ కో–ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో 78 మంది బడి బయట పిల్లలు ఉన్నారని, వారి పూర్తి వివరాలు తెలుసుకొని ఉండాలన్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిత్యం ఉందని తెలిపారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.విజయ కమల, డివిజన్ స్థాయి సీఆర్పీలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సహకారం మరువలేనిది


వాటర్ క్యాన్, స్టాండ్ బహూకరిస్తున్న రమాదేవి తదితరులు

సత్తెనపల్లి: రోటరీ క్లబ్ సహకారం మరువలేనిదని ప్రధానోపాధ్యాయుడు కొప్పాల వెంకటేశ్వర్లు చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి, ఆంధ్రప్రదేశ్ కన్జ్యూమర్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని 23వ వార్డులో పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ డైరెక్టర్ సరికొండ రమాదేవి సహకారంతో వారి తల్లిదండ్రులు సరికొండ లచ్చరాజు, వెంకటనర్సమ్మ జ్ఞాపకార్థం మినరల్ వాటర్ క్యాన్, స్టాండ్, గ్లాసులు మంగళవారం అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొప్పాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త బెల్లంకొండ నాగ సాయి ప్రసాద్, ప్రెసిడెంట్ పాయసం మహేష్ బాబు, ట్రెజరర్ స్వామినాథన్ బాలసుబ్రమణ్యం, డైరెక్టర్లు మాతంగి సాంబశివరావు, కన్జ్యూమర్ రైట్స్ ప్రతినిధులు తుమ్మల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కరుణామయీ కానుకమాత

రెంటచింతల: కరుణామయీ కానుకమాత అని దాచేపల్లి విచారణ గురువులు ఫాదర్ యామర్తి సురేష్ చెప్పారు. స్థానిక కానుక మాత చర్చి 173వ తిరునాళ్లను పురస్కరించుకుని మంగళవారం విచారణ గురువులు ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పునీత ఆరోగ్యనాథుని మందిరం వద్ద నవదిన ప్రార్థనలలో భాగంగా సమష్టి దివ్య పూజాబలి నిర్వహించారు. ఫాదర్ సురేష్ మాట్లాడుతూ పరిపూర్ణ హృదయంతో క్రీస్తు సూక్తులను అనుసరించాలన్నారు.